క్లుప్తంగా

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



భీమవరంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి సుందరయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్ పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 30వ వర్ధంతిని శుక్రవారం భీమవరం మెంటేవారితోట సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ సుందరయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, పట్టణ కమిటీ సభ్యులు బొక్క సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరావు, బంగారు వరలక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర నిబంధనల మేరకు ఉపాధి కూలీలకు వేతనం

సాక్షి, భీమవరం: ఉపాధి హామీ కూలీలకు కేంద్రప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనం చెల్లిస్తున్నామని జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌టీవీ రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్తిలి మండలం ఈడూరులో ఉపాధి హామీ కూలీలకు రూ. 600 వేతనం, 200 పనిదినాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్ చేసిన డిమాండ్‌కు రాజేశ్వరరావు ఈ మేరకు వివరణ ఇచ్చారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ఉండి: మండలంలోని పెదపుల్లేరులో పేకాట స్థావరంపై ఎస్సై కే గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలోపేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.7870 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం



బొండాడలో నూతనంగా వేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రారంభిస్తున్న దృశ్యం

కాళ్ల: బొండాడ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించామని గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు తెలిపారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. బొండాడ గ్రామంలో చినపేట నుంచి లంకరోడ్డుకు వెళ్లే మార్గంలో ఉన్న 5, 7 వార్డుల్లో లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్నారు. స్థానికుల సమస్యను దృష్టిలో ఉంచుకుని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆదేశాలతో అధికారులు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ వైసిపి సీనియర్ నాయకులు మన్నే నాగరాజు తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఆప్రాంతంలో లోవోల్టేజ్ సమస్య తీరనుందన్నారు.

విశాఖ విహారయాత్రకు స్పెషల్ బస్సుల ప్రారంభం



విహారయాత్ర వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : తాడేపల్లిగూడెం డిపో నుంచి ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు విశాఖ విహార యాత్ర స్పెషల్ బస్సులను ప్రారంభించామని, ఈ బస్సులను వినియోగించుకోవాలని ఆర్టీసీ గూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఈ యాత్రంలో సుప్రసిద్ధ సింహాచలం దేవాలయం దర్శనం, కైలాసగిరి, వుడా పార్క్, నేవీ మ్యూజియం, సబ్ మెరైన్, ఆర్‌కే బీచ్, కాశీ టెంపుల్ చూపించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయంనకు బస్ తాడేపల్లిగూడెం డిపోనకు చేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులకు టికెట్ ధర పెద్దలకు రూ.1650, పిల్లలకు రూ.810గా నిర్ణయించామన్నారు. అదే విధంగా జూన్ 2న డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్ర స్పెషల్ బస్సు బయలు దేరుతుందని తెలిపారు. ఈ బస్సు కాళహస్తీశ్వర స్వామి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, గిరి ప్రదక్షిణ, అనంతరం 5వ తేదీన తిరిగి వస్తుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ 2,600గా నిర్ణయించినట్లు వెల్లడించారు.

ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

ఎమ్మెల్యే శ్రీనివాస్



భీమవరంలో టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం వల్లనే విద్యార్థుల సంఖ్య పెరగడమేగాక పరీక్షల్లో సైతం మంచి ప్రతిభ కనబరుస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. టెన్త్ పరీక్షాలో మంచి ఫలితాలు సాధించిన భీమవరం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సైతం ఉన్నత విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకంలో పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడమే గాక విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీనివాస్ తెలిపారు. టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సైతం ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనుందని చెప్పారు. అనంతరం పట్టణంలోని ఆరు మునిసిపల్ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, అడిషినల్ ఎస్పీ సుబ్బరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, మునిసిపల్ కమిషనర్ సబ్బి శివ రామకృష్ణ, నల్లం రాంబాబు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

సాక్షి, భీమవరం: ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని, వీఆర్‌ఏలకు సంబంధించిన ప్రధాన సమస్యలు వెంటనే పరిష్కరించాలనే డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ ఎస్.శివశంకర్, ఎస్.కృష్ణమోహన్, ఫణికుమార్, ఎం.రామ్ ప్రసాద్ రాజు, వీరవల్లి వెంకటేశ్వరావు, ఎం.నాగభూషణం, వీవీ పెద్దిరాజు, భోజియ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు

సాక్షి, భీమవరం: స్థానిక హెడ్‌పోస్టాఫీసులో శుక్రవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించినట్లు పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. ఈ శిబిరంలో మ్యాక్స్‌విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు 60మంది పోస్టల్ సిబ్బందికి పరీక్షలు చేశారన్నారు. కంటి ఆరోగ్యానికి సంబంధించిన సలహాలు, సూచనలు చేసినట్లు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

సుందర్ ఫౌండేషన్ కార్యాచరణ సదస్సు

సాక్షి, భీమవరం: సుందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షుడు జిజే సుందర్‌రావు అన్నారు. భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీక శాలలో శుక్రవారం ఫౌండేషన్ కార్యచరణ సదస్సులో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు, అవగాహన సదస్సులు నిర్వహించడమే కాక అనాథలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం, లయన్స్‌క్లబ్ జిల్లా జాయింట్ సెక్రటరీ కొమ్ముల మురళీకృష్ణ, కోన జోసెఫ్, కాకుమాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిఫారసులు లేకుండా సంక్షేమ పథకాలు

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



వేండ్రలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

పాలకోడేరు: రాష్ట్రంలో అర్హత ఉన్న లబ్ధిదారులకు ఎలాంటి సిఫారసులు లేకుండా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. వేండ్ర గ్రామంలో రెండోరోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పీవీఎల్ పర్యటించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పేదలకు సెంటు స్థలం ఇస్తుంటే శవాలను పుడ్చుకోవడానికా? అని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వేండ్ర గ్రామం లో ప్రజలు ప్రభుత్వ పథకాలు ఎలాంటి సిఫార్సులు లేకుండా అందుతున్నాయన్నారు. వేండ్ర గ్రామంలో ఇంటింటికీ వెళ్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ పథకాలన్నీ అందుతున్నాయని ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించుకోవడానికి స్థలంతో పాటు సాయం కల్పించి సొంతగూడు కల నెరవేరుస్తున్నామన్నారు. పైపులు చెరువు రోడ్‌లో ఇచ్చిన ఇళ్ల స్థలాలకు మెరక చేశామని అక్కడ కూడా ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి కుటుంబంలో సంక్షేమ పథకాలు లబ్ధి పొందుతున్నామని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి జగన్ గెలిపించుకుంటామని వారు చెబుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, సర్పంచ్ కడలి నాగేశ్వరి, కేసుబోయిన వెంకటేశ్వరరావు, వేణు, వేగి రమణ, గండి జాను, ఇంటి దేవరాజు, బి.నాగరాజు, కోనాల సుబ్బారావు, శేఖర్ బాబు, కె.రాంబాబు, సీహెచ్ దొరబాబు, జి.కిరణ్, పెన్మత్స శ్రీనివాసరాజు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, పెన్మత్స సీతారామరాజు, ఎంపీటీసీ సభ్యులు పాల జ్యోతి, షేక్ పాప సాహెబ్ నాగ వెంకటలక్ష్మి, కొత్తపల్లి స్వాతి, తంగెళ్ల మంజుల, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి రంగరాజు, గెద్దం జోషి, శివకోడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన

పాలకోడేరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఇళ్ల స్థలాల పంపిణీపై చేసిన విమర్శలను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పాలకోడేరు మండలం వేండ్రలో పీవీఎల్ వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో, నాయకులతో కలిసి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.. కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, సర్పంచ్ కడలి నాగేశ్వరి, చేకూరి నరేంద్ర రాజు ,ఎంపీటీసీ సభ్యులు పాలా జ్యోతి, షేక్ పాపా సాహెబ్, కె.వెంకటనాగలక్ష్మి, కొత్తపల్లి స్వాతి, తంగేళ్ల మంజుల, వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి, గుండు నాగేశ్వరరావు సాగిరాజ హరి వర్మ, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

పేదలకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షంగా నిలిచి వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తే అవి శవాలు పూడ్చుకోవడానికి కూడా సరిపోదు అంటూ పేదలను హేళన చేసినందుకు మాజీ సీఎం చంద్రబాబునాయుడు పేదలకు క్షమాపణలు చెప్పాలంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఇళ్ల స్థలాలు పేదలకు ఇస్తే పెత్తందారీ మనస్తత్వం కలిగిన చంద్రబాబు పేదారి ఆత్మాభిమాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. దీనిని ఖండిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని పేదలకు క్షమాపణలు చెప్పకపోతే వచ్చే ఎన్నికల్లో చావుదెబ్బ తప్పదని హితవు పలికారు. పేదలకు అమరావతిలో స్థలాలు ఇవ్వడాన్ని ఓర్చుకోలేకపోతున్న చంద్రబాబు పేదలను అడ్డుపెట్టుకుని దోచుకుని తిన్నారని మండిపడ్డారు.

పెనుమంచిలి అభివృద్ధికి కృషి



తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

పెనుగొండ: పెనుమంచిలి అభివృద్ధికి నిధులు కేటాయించి కృషి చేస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెం కార్యాలయంలో పెనుమంచిలిలో రహదారి, డ్రెయినేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో ఇటీవలే రూ.20లక్షలతో రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. దీంతో పాటు కమ్యూనిటీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామని వివరించారు. త్వరలోనే మరిన్ని నిధులు కేటాయించడానికి ప్రతిపాదనలు చేస్తామన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించి గ్రామాభివృద్ధికి పాటు పడతానన్నారు.

అదుపులోకి రైతుల సమస్యలు

నియోజకవర్గంలో రైతుల సమస్యలు అదుపులోకి వస్తున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతోనూ, పలువురు రైతులతోనూ సమీక్షించారు. అకాల వర్షంతో పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. వారందరినీ ఆదుకోవడానికి జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. నిత్యం రైసుమిల్లర్లు, అధికారులతో సమన్వయంతో ముందుకు సాగారన్నారు. అదేవిధంగా ఆచంట నియోజకవర్గంలో రైతులకు గోనే సంచులు ఇబ్బందులు లేకుండా ఇతర ప్రాంతాల నుంచి గోనే సంచులు తీసుకువచ్చి ఇచ్చామన్నారు. మరికొందరికీ విడతల వారీగా అందుతాయన్నారు. రైతులు ఎవరూ ఆందోళన పడవద్దని, రైతులకు ఎప్పటికీ అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో పెనుమంత్ర ఎంపీపీ కేఎస్‌వీ నారాయణ రెడ్డి(వాసు), పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరు పెద్దిరాజు, పార్టీ నాయకులు పెనుమత్స విశ్వనాథరాజు, గణేషుల సుబ్బారావు, కొవ్వూరి చిన్న, గుబ్బల వీర బ్రహ్మం, మేడిచర్ల పండు, పాలసత్తి రాజా తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం



మేడపాడులో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

యలమంచిలి: మేడపాడు గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మిస్తున్న అదనపు వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మేడపాడు గ్రామంలో ప్రధాన మంచినీటి చెరువు వద్ద, గ్రామ సచివాలయం వద్ద, సాకావారిపేటలో మొత్తం మూడు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఈ ట్యాంకులకు దూరంగా కలెక్టర్ వారి వీధి, గరువు, ఇందిరమ్మ కాలనీలు ఉండడంతో ఆ ప్రాంతాలకు కుళాయి నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. దీంతో స్థానిక సర్పంచ్ గంటా శాంతకుమారి, సొసైటీ త్రిసభ్య కమిటి చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ దేగల సూర్యప్రభల అభ్యర్థన మేరకు జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ జేజేఎం పథకంలో రూ.40 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో గ్రామంలోనే ప్రభుత్వాసుపత్రికి దగ్గరలో ఉన్న తామర చెరువు వద్ద 40 వేల లీటర్ల సామర్థ్యంతో మరో వాటర్ ట్యాంకు నిర్మాణం ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నెల రోజుల్లో ట్యాంకు నిర్మాణం పూర్తి చేయిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మద్రిపూడి సురేష్ బాబు తెలిపారు. వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయ్యాక ప్రధాన మంచినీటి చెరువు నుంచి ఈ వాటర్ ట్యాంకుకు పైపులైన్ వేసి గరువు, కలెక్టర్ వారి వీధి, ఇందిరమ్మ కాలనీకి తాగునీరు అందిస్తామని ఆయన వివరించారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



ఎన్నార్పీ అగ్రహారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఏవీ అప్పారావు

ఉండి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీడీఓ ఏవీ అప్పారావు తెలిపారు.శుక్రవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరు, రోగుల వివరాలను అందిస్తున్న సేవలు, టెస్టులు వీటిపై వైద్యాధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఇంటికి వచ్చి సేవలు అందించడం ఏ ఒక్కరూ ఊహించని విషయమన్నారు. కానీ నెలలో ఒకటి లేదా రెండుసార్లు ప్రభుత్వ డాక్టర్ ఇంటికి వచ్చి పరీక్షలు చేయడం లేదా వైద్య సహాయం అందిస్తారన్నారు. ఇది ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమన్నారు .కాబట్టి ప్రజలంతా ముఖ్యంగా గ్రామీణ ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు వైద్యుని సలహాలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణులకు ఈ కార్యక్రమం మరింత ప్రయోజనకరమన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

నరసాపురం: నరసాపురం నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో శనివారం సాయంత్రం 4 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో వలంటీర్లంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సీడబ్ల్యూసీ గోడౌన్స్ సమస్యలపై వినతి



సమస్యలపై ఉప ముఖ్యమంత్రి కొట్టుకు వినతి పత్రం అందజేస్తున్న సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని సీడబ్ల్యూసీ గోడౌన్స్‌ను పూర్తి సామర్థ్యంతో పనిచేయించాలని, గోడౌన్స్‌కు మరమ్మతులు చేయించాలని, సంస్థ ఆదాయాన్ని, కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ఏడాది గోడౌన్ కేవలం ఒక్క నెల మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేసిందని, దాంతో గోడౌన్ పనులపై ఆధారపడిన 125 మంది కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పందించి హైదరాబాద్‌లోని సీడబ్ల్యూసీ ప్రాంతీయ మేనేజర్ నిర్మల్ బండారితో ఫోన్‌లో మాట్లాడారు. 72 వేల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన తాడేపల్లిగూడెం గోడౌన్ తమ ప్రాంతానికి ఎంతో కీలకమైనదని, దానిని పక్కన పెట్టడం తగదని వెంటనే మరమ్మతులు చేయించాలని కొట్టు సత్యనారాయణ సూచించారు. అవసరమైతే విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళతానని ఆయన ప్రాంతీయ మేనేజర్‌కు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక గోడౌన్ మేనేజర్‌తో మాట్లాడారు. గోడౌన్ నిర్వహణ తీరుపై తనకు పలు ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు ఉన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



తణుకులో పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : తణుకులోని కొమ్మాయిచెర్వు అర్బన్ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి అనంతరం సచివాలయ పరిధిలో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికోసారి డ్రైడేను పాటించడం వలన ఇంటి పరిసరాలు శుభ్రపడి దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని అన్నారు. ముఖ్యంగా మురుగు కాల్వల్లో ఎటువంటి చెత్త పారవేయరాదన్నారు. దోమల నివారణను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి అనుకూలంగా కోర్టు తీర్పు



పాలమూరులో పునర్నిర్మిస్తున్న ఆలయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలమూరు గ్రామంలో భక్తుల ఆధ్వర్యంలో పునర్నిర్మిస్తున్న శ్రీ మురళీకృష్ణ ఆలయం అక్రమ కట్టడమని, దాన్ని వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ పంచదార వెంకట లక్ష్మీ నారాయణ స్వామి నాయుడు హైకోర్టులో వేసిన అప్పీల్‌ను డివిజన్ బెంచ్ కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పణతుల వీరాస్వామి శుక్రవారం విలేకరులకు తెలిపారు. 1987లో గ్రామంలో శ్రీ మురళీకృష్ణ ఆలయం నిర్మించామని, అయితే గ్రామ ప్రజల విరాళాలతో అందరి అభిప్రాయాలకు అనుగుణంగా శిథిలమైన ఆలయాన్ని పునర్నిర్మించేందుకు గత ఏడాది ఆగస్టులో శంకుస్థాపన చేశామన్నారు. ఆ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వెంకట లక్ష్మీ నారాయణ స్వామి నాయుడు పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు దౌర్జన్యంగా, అక్రమంగా కట్టడాన్ని నిర్మిస్తున్నారని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారన్నారు. ఈ పిటిషన్‌లో తనతో పాటు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను కూడా బాధ్యులను చేశారన్నారు. అక్రమ కట్టడాన్ని తక్షణం నిలిపివేయాలని సర్పంచ్ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు సింగిల్ బెంచ్ గత నెల 19న సర్పంచ్ వేసిన పిటిషన్ కొట్టివేసిందన్నారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును ఛాలెంజ్ చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారన్నారు. ఈ అప్పీల్‌ను న్యాయమూర్తులు గురువారం వర్చువల్ విధానంలో విచారణ చేపట్టారని, విచారణ అనంతరం ఆలయానికి అనుకూలంగా న్యాయమూర్తులు తీర్పు చెప్పారన్నారు. అంతేకాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఇలాంటి కేసులను కోర్టుల వరకు తీసుకురావద్దని పిటిషన్ వేసిన సర్పంచ్‌ని మందలించారని వీరాస్వామి విలేకరులకు తెలిపారు. గ్రామంలో శిథిలమైన శ్రీ మురళీకృష్ణ ఆలయం నిర్మిస్తుంటే అది అక్రమ కట్టడమంటూ గత ఆరు నెలలుగా తమ వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతినే విధంగా సర్పంచ్ వెంకట లక్ష్మీ నారాయణస్వామి నాయుడు పత్రికలు, సోషల్‌మీ డియాలో అల్లరి చేశారని వీరాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఇసుక లోడు లారీ

పెనుమంత్ర: మండలంలో వెలగలేరు పెట్రోల్‌బంక్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేసిన ఆక్వాఫీడ్స్ లోడుతో ఉన్న లారీని వెనుక నుంచి ఇసుకలోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోయినప్పటికీ ఇసుక లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆగిఉన్న లారీ వెనుకభాగం స్వల్పంగా దెబ్బతింది. ఇసుకలోడు లారీలో క్లీనర్ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన ఇసుకలారీ ఓనర్ చిట్టూరి సుధీర్‌కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు పెనుమంత్ర పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి సాయంత్రం మంచినీటి సరఫరా నిలిపివేత

నరసాపురం: హెడ్ వాటర్ వర్క్స్‌లో మరమ్మత్తులు కారణంగా శనివారం సాయంత్రం పూటి కుళాయిల ద్వారా ఇచ్చే మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.